
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు : గరిష్టం : 37.0 । కనిష్టం : 23.0
ANDHRAJYOTHY
5



జోగులాంబ గద్వాల
జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

తొలి సారిగా..



సీఎం శంకుస్థాపనలు చేసేందుకు సిద్ధమౌతున్న ప్రాంగణం

- సీఎం అయ్యాక మొదటిసారి సొంత నియోజకవర్గంలో నేడు రేవంత్ పర్యటన
- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన
- మెడికల్, మహిళ, తొలి ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీకి శ్రీకారం
- పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ
- మొత్తం అభివృద్ధి పనుల అంచనా వ్యయం రూ.3,979 కోట్లు



రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రేవంత్‌రెడ్డి తొలిసారిగా తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. వాస్తవానికి ఈ నెల ఐదో తేదీనే ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని భావించగా.. అసెంబ్లీ సమావేశాలు, కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన, బడ్జెట్, ఇరిగేషన్‌పై శ్వేత పత్రం విడుదల నేపథ్యంలో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు బుధవారం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి రేవంత్ రెడ్డి శాసనసభకు మూడోసారి ప్రాతినిధ్యం వస్తున్నారు. ఒకసారి ఎమ్మెల్సీ, ఒకసారి ఎంపీగా చేసినప్పటికీ.. ప్రతీసారి ప్రతిపక్షంలోనే ఉండటంతో అభివృద్ధి పనుల విషయంలో గత ప్రభుత్వాలు కొంత వివక్షను ప్రదర్శించాయనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించేందుకు 2014లో జారీ అయిన 69 జీవోను దశాబ్దకాలంగా అటకెక్కించారు. దానికి ప్రత్యామ్నాయంగా శ్రీశైలం సోర్స్‌గా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నిరందిస్తామని గత ప్రభుత్వాలు ప్రకటించినా.. ఇప్పటికీ కొడంగల్ ప్రాంతంలో దుర్భిక్షమైన పరిస్థితులే ఉన్నాయి. రేవంత్‌రెడ్డిని ఇక్కడి నుంచి అసెంబ్లీకి పంపడం ద్వారా సీఎం అవుతాడని ఎన్నికల సమయంలో అందరూ భావించినట్లుగానే ఆయన సీఎం అయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి.. దానికి ప్రత్యేక అధికారిని నియమించారు. గత ప్రభుత్వాల హయాంలో ఇలా ఏర్పాటైన ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా ఆయా నియోజకవర్గాల్లో సమగ్రమైన అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం కూడా ఏర్పాటు కావడంతో కూడా కొడంగల్ ప్రాంతం అభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం కచ్చితంగా ఉంది. నియోజకవర్గంలో బుధవారం పర్యటించనున్న సీఎం రేవంత్ రెడ్డి 63 అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3,979 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం పనులకు కోస్గి పట్టణంలోనే శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. అక్కడే నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అయితే ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముందుగా అనుకున్న పనులకు శంకుస్థాపనలు చేస్తుండగా.. ఎన్నికల తర్వాత కొడంగల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి దిశగా పరుగులు పెట్టే అవకాశాలు ఉన్నాయి.

ప్రజల్లో మరిన్ని ఆశలు..

కొడంగల్ నియోజకవర్గంలో ప్రధానంగా ఉన్న సాగునీటి సమస్య పరిష్కారానికి నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. విద్య వైద్యం అభివృద్ధి కోసం మెడికల్, ఇంజనీరింగ్, మహిళా డిగ్రీ కాలేజీలకు ఆమోదం వచ్చింది. ఇవే కాకుండా ప్రజల్లో ఇంకా భారీగా ఆశలు ఉన్నాయి. కోస్గికి సాగు నీరు అందించే దండం చెరువు కాలువకు మరమ్మతులు, ఆర్టీసీ డిపోకు బస్సుల మంజూరు, ప్రతీ తండాకు, గూడేనికి బీటీ రోడ్ల నిర్మాణం, కొడంగల్, కోస్గి పట్టణాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కొడంగల్ నియోజకవర్గంలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం, యువత వలసలు పోకుండా స్థానికంగా ఉపాధి పొందడంతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించడానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గతంలో మాజీ సీఎం కేసీఆర్ ఆయా జిల్లాల పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి ప్రత్యేక నిధుల కింద గ్రామాలకు రూ.20 లక్షల చొప్పున, పట్టణాలకు జనాభాను బట్టి సుమారు రూ.50 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు. తన సొంత నియోజకవర్గానికి ఎన్నడూ లేనంతగా నిధులు మంజూరు చేయించుకున్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా సీఎం ప్రత్యేక నిధుల కింద గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతున్నారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతోపాటు.. అభివృద్ధి పనులపై ప్రణాళికలు సిద్ధం చేసేలా ఆదేశించాలని కోరుతున్నారు.

శంకుస్థాపన చేసే కార్యక్రమాలివే..

సాయంత్రం నాలుగు గంటలకు హెలికాప్టర్ ద్వారా కోస్గి పట్టణానికి చేరుకోనున్న సీఎం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన శిలాఫలాలకు ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత మహిళా సమాఖ్య సమీపంలో ఉన్న మైదానంలో బహిరంగ సభలో పాల్గొని.. రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు వెళ్తారు. ఈ పర్యటనలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్ల నిర్మాణం, హైలెవల్ వంతెనల నిర్మాణం కోసం 17 పనుల(రూ.391.30 కోట్లు)కు శంకుస్థాపన చేస్తారు. రూ. 32.86 కోట్లతో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టే బీటీ రోడ్లు, హాస్టల్ బిల్డింగుకు, రూ.25 కోట్లతో చేపట్టనున్న మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌కు శాశ్వత భవనం పనులకు, ఉన్నత విద్యకు సంబంధించి దౌల్తాబాద్‌లో జూనియర్ కాలేజీ భవనం, బొంరాస్‌పేటలో కొత్త జూనియర్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ, మెడికల్ కాలేజీకి రూ.308.63 కోట్ల పనులకు, ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.45 కోట్లతో రెసిడెన్షియల్ స్కూళ్లు, జూనియర్ కాలేజీలకు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కింద రూ.25 కోట్లతో నిర్మించే మహాత్మ జ్యోతిబాపూలే స్కూల్, జూనియర్ కాలేజీ, వెటర్నరీ సైన్స్ కాలేజీ భవనం, ఇరిగేషన్ శాఖ కింద రూ.2,945 కోట్లతో చేపట్టే నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆర్‌డబ్ల్యూఎస్(మిషన్ భగీరథ) కింద రూ.18.7 కోట్లతో చేపట్టే అదనపు పనులకు, రూ.257.12 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

కొడంగల్ ఎత్తిపోతల సాకారం..

ఉమ్మడి పాలమూరులో అత్యంత వెనుకబాటులో ఉన్న ప్రాంతాల్లో దాదాపు మొదటి స్థానంలో కొడంగల్ నియోజకవర్గం ఉంటుంది. ఏళ్లుగా దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఈ ప్రాంత కరువు ప్రధాన ఎజెండాగా తెలంగాణ ఉద్యమం సాగినా.. నియోజకవర్గానికి నీరందించే పనులను గత ప్రభుత్వాలు పక్కన పెట్టాయనే విమర్శలున్నాయి. కేవలం తక్కువ ఖర్చుతో.. తక్కువ వ్యవధిలో ప్రాజెక్టును పూర్తిచేసుకుని.. నీరందించుకునేందుకు ఉద్దేశించిన జీవో 69ను గత ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ పథకం సాధన కోసం జల సాధన సమితి పేరిట ఉద్యమాలు జరిగాయి. రేవంత్‌రెడ్డి పలుమార్లు గత ప్రభుత్వాలకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఆయన సీఎం అయిన తర్వాత మొదటిసారిగా పాత జీవో 69ను రద్దు చేసి.. జీవో ఆర్టీ నెంబర్ 14 ద్వారా పథకానికి ఈ నెల ఎనిమిదో తేదీన సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. లక్ష ఎకరాలకు సాగునీరు అందించడం కోసం ఉద్దేశించిన ఈ పథకానికి రూ.2,945.50 కోట్లు కేటాయించారు. బుధవారం ఈ పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో మొదట ప్రారంభమయ్యే ఇరిగేషన్ ప్రాజెక్టు ఇదేనని చెప్పొచ్చు. అలాగే నియోజకవర్గానికి కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేశారు. కొడంగల్‌లో ఉన్న పాలిటెక్నిక్ కాలేజీని అప్‌గ్రేడ్ చేయడం ద్వారా రాష్ట్రంలోనే మొదటి ప్రభుత్వ ఇంజనీరింగ్ కొడంగల్‌లో ఏర్పాటు కానుంది. దానికి, మహిళా డిగ్రీ కళాశాల భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. మండలాల నుంచి నియోజకవర్గ కేంద్రానికి డబుల్ రోడ్లు, రోడ్లు లేని గ్రామాలకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

సీఎం పర్యటనకు సర్వం సిద్ధం

కోస్గి రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గి పర్యటనకు సర్వం సిద్ధమైంది. నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్‌గౌతమ్, అదనపు కలెక్టర్ మయాంక్‌మిట్టల్ మంగళవారం సభ ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక కళాశాల మైదానంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలు, డీఆర్‌డీఏ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. స్టాల్స్‌ను పరిశీలించిన అనంతరం సీఎం సభా ప్రాంగణానికి చేరుకుంటారు. కోస్గిలో ఏర్పాటు చేసే హెలిప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రి సాయంత్రం నాలుగు గంటలకు చేరుకుంటారు. సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. 1,400 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నారు. సుమారు లక్ష మంది సభకు రానున్నారని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన తిరుపతిరెడ్డి

ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను కాంగ్రెస్ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి కలెక్టర్ కోయ శ్రీహర్షను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జోగులమ్మ తల్లీ.. దీవించవమ్మా

- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన క్షేత్రం
- నేడు మెట్టినింటికి రానున్న అమ్మవారు



అమ్మవారిని తీసుకొచ్చేందుకు సారెతో వెళ్తున్న వారిని సాగనంపుతున్న చైర్‌పర్సన్ దంపతులు

గద్వాల, ఫిబ్రవరి 20: జములమ్మ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని తీసుకొచ్చేందుకు ఎద్దుల బండి పుట్టినిల్లు గుర్రంగడ్డకు వెళ్లింది. అంతకుముందు ఆలయానికి వచ్చిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరిత దంపతులకు అర్చకులు, ఆలయ చైర్‌పర్సన్ కుర్వ గాయత్రి, ఈవో పురేందర్‌కుమార్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత అమ్మవారిని మెట్టినింటికి తీసుకరావడానికి నిర్వాహకులు సారెతో బయల్దేరారు. జడ్పీ చైర్‌పర్సన్ దంపతులు వారిని బాజా భజంత్రీలతో ఎద్దుల బండి వరకు సాగనంపారు. జమ్మిచేడు, లత్తీపురం, బీరోలు మీదుగా సాయంత్రం వారు గుర్రంగడ్డకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం బుధవారం తెల్లవారుజామున అమ్మవారిని జమ్మిచేడుకు తెస్తారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ కుర్వ సతీష్‌కుమార్. డైరెక్టర్లు అభిలాష్, ఓంప్రకాష్ కామ్లే పాల్గొన్నారు.

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే భక్తుల తాకిడి పెరిగింది. తెలంగాణతో పాటు రాయలసీమ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ చైర్‌పర్సన్ కుర్వ గాయత్రి తెలిపారు. అయితే ఎండలు దంచికొడుతున్న తరుణంలో భక్తులకు మంచినీళ్లు కరువయ్యాయి. దీంతో దుకాణాల్లో నీరు కొనుగోలు చేసి తాగాల్సి వచ్చింది. మరుగుదొడ్లు కూడా సరిపోను లేవు. గత ఏడాది నిర్మాణం ప్రారంభించినా పూర్తి చేయలేదు. వలంటీర్లు లేకపోవడంతో భక్తులకు సరైన సేవలు అందడం లేదు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ట్రాఫిక్‌ను చక్కదిద్దలేక ఓ దశలో పోలీసులు చేతులెత్తేశారు.

పీఎం ఉష పథకానికి పీయూ

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- పథకం కింద ఎంపికవడం శుభపరిణామం: యెన్నెం



పీఎం-ఉషా పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, కలెక్టర్ రవి

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 20: ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియన్(పీఎం-ఉష) పథకం కింద ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న మన పాలమూరు యూనివర్సిటీ ఎంపికవడం శుభపరిణామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో ఈ పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఢిల్లీ నుంచి ప్రారంభించారు. వర్సిటీలో ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, పీయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, కలెక్టర్ రవికుమార్‌లతో కలిసి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర మానవ వనరుల శాఖ ద్వారా మల్టీ డిసిప్లినరీ ఎడ్యుకేషన్ రీసెర్చ్ యూనివర్సిటీస్(ఎంఈఆర్‌యూ)ద్వారా ఎంపిక చేసిన 25 వర్సిటీలలో ఒక్కో దానికి పథకం కింద రూ.100 కోట్ల నిధులను ఇస్తారన్నారు. వాటిని అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు చెప్పారు. ఈ నిధులతో పీయూ ఎడ్యుకేషన్ హబ్‌గా మరుతుందన్నారు. ఈ నిధుల విడుదలకు పార్టీలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, బీజేపీ నాయకురాలు డీకే అరుణ వంటి ముఖ్య నాయకులతో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం వంటి అధికారులతో కలిసి పని చేశామన్నారు. పీయూకు రాష్ట్ర ప్రభుత్వ నిధులనూ తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. అంతకు ముందు పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మాట్లాడుతూ పీఎం ఉష పథకానికి దేశవ్యాప్తంగా 1114 వర్సిటీలు దరఖాస్తు చేసుకోగా, కేవలం 25 వర్సిటీలకు మాత్రమే రూ.100 కోట్ల చొప్పున మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, ఈసీ మెంబర్స్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌లను వీసీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్, వీసీ పీయూలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఈసీ మెంబర్లు డాక్టర్ నూర్జహాన్, డాక్టర్ కిశోర్, గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఎంఈడీ ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలతోనే పొత్తు

- కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి
- నారాయణపేట జిల్లాలో విజయ సంకల్ప యాత్ర ప్రారంభం



మక్తల్‌లో జరిగిన సభలో అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రులు పురుశోత్తం రూపాల, కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కార్యవర్గ సభ్యులు జితేందర్‌రెడ్డి తదితరులు

నారాయణపేట టౌన్/మక్తల్/కృష్ణ/ఊట్కూర్, ఫిబ్రవరి 20: బీజేపీకి ఏ పార్టీలతో అవసరం ఉండదని, ప్రజలతోనే పొత్తు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని కృష్ణానది ఒడ్డున గల కృష్ణమ్మ విగ్రహానికి ఆయన వేద పండితులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మూడోసారి మోదీ హ్యాట్రిక్ పీఎం అవుతారన్నారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కోశాధికారి శాంతికుమార్‌లతో కలిసి సంకల్ప యాత్ర రథానికి పూజలు చేసి, జెండా ఊపి ప్రారంభం చేశారు. అంతకు ముందు నదికి చేరుకునేందుకు వస్తూ.. మధ్యలో ఉన్న గోశాలలో గోవులకు కిషన్‌రెడ్డి, డీకే.అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

రాహుల్ డబ్బులు వసూలు చేస్తున్నారు

దేశంలో కాంగ్రెస్ పాలన తక్కువగా ఉన్నందున పార్లమెంట్ ఎన్నికల కోసం రాహుల్ గాంధీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్తును మార్చే ఎన్నికలన్నారు. దేశ భవిష్యత్ కోసం మోదీ నాయకత్వంలో పని చేయడం తామందరం చేసుకున్న అదృష్టమన్నారు. తొమ్మిదేళ్లలో దేశంలో మత కలహాలు, బాంబు పేలుళ్లు జరగలేదన్నారు. దేశంలో ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపారని చెప్పారు. ధర్మ పాలన కోసం, అవినీతి రహిత అభివృద్ధి కోసం బీజేపీని మరోసారి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. దోపిడీ, దగా కుటుంబ పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ మోదీ మరోసారి పీఎం కావడమే లక్ష్యంగా విజయ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2047 వరకు దేశం ప్రపంచ స్థాయిలో నంబర్ వన్‌గా నిర్మించేందుకు మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు.



కృష్ణమ్మ విగ్రహానికి పూజలు చేస్తున్న కిషన్‌రెడ్డి

పేద ప్రజల అభివృద్ధికి మోదీ కృషి

మక్తల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుశోత్తం రూపాల మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కుటుంబ పాలనతో బాగుపడ్డాయని, కానీ నరేంద్రమోదీ పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 2013లో తెలంగాణ రాష్ట్రం కోసం కృష్ణ నుంచి యాత్ర ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

రైతులతో ముఖాముఖి

ఊట్కూర్ చెక్‌పోస్టు సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయం ఆవరణలో జరిగిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర నాయకత్వంతో కలిసి కిషన్‌రెడ్డి మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రూ.12 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని చెప్పారు. అంతకుముందు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మాట్లాడుతూ గల్లీలో ఎవరు ఉన్నా ఢిల్లీలో మాత్రం మోదీ ప్రభుత్వమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్, నాయకులు బండారు శృతి, నాగురావు నామోజీ, కొండయ్య, జలంధర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మౌనిక, శ్రీవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పడాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సంకల్ప రథ యాత్రను ప్రారంభించి, వాహనంపై వెళ్తున్న కిషన్‌రెడ్డి, డీకే అరుణ తదితరులు

సమగ్ర నివేదిక ఇవ్వండి

- అక్రమ లే అవుట్‌పై ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సీరియస్
- రంగంలోకి మునిసిపల్ కమిషనర్ నరేష్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండ కొత్త వ్యవసాయ మార్కెట్ ఎదురుగా వెలిసిన అక్రమ లే అవుట్, అనుమతులు లేకుండా జరిగిన నిర్మాణాలపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'లే'అవుట్' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. ఈ విషయమై ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మునిసిపల్ అధికారులపై సీరియస్ అయ్యారు. జిల్లా కేంద్రంలో ఇంత యంత్రాంగం ఉన్నా.. అక్రమ లే అవుట్‌లను ఎందుకు నిరోధించలేకపోయారంటూ ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆదేశంతో మునిసిపల్ కమిషనర్ నరేష్‌కుమార్ మంగళవారం నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న అక్రమ లే అవుట్, అక్కడ వెలిసిన భవన నిర్మాణాలను పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదిక అందించాల్సిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. విచారణ జరిగితే దీని పక్కన వెలిసిన ఇంకో అక్రమ వెంచర్‌పై కూడా వేటు పడే అవకాశం ఉండటంతో అధికారులను మేనేజ్ చేసుకునేందుకు రియల్ ఎస్టేట్ మాఫియా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

అందుకే ప్రజలు మట్టి కరిపించారు

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట, ఫిబ్రవరి 20: నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిన తెలంగాణలో గత పాలకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నియంతలా వ్యవహరించారని, అందుకే ప్రజలు వారిని మట్టి కరిపించారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల అచ్చంపేట నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని మంగళవారం పట్టణంలోని పటేల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లడారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలను మోసగించి, నిజాలు బయటకు రాకుండా పరిపాలన చేశారన్నారు. బంగారు తెలంగాణ అంటూ.. బంగారు పళ్లెంలో రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పును పెట్టి మా ప్రభుత్వానికి అందించారన్నారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసి, ఎవరైనా ప్రశ్నిస్తే రౌడీలు, గూండాల్లా వ్యవహరించారన్నారు. ఇప్పటికే తమ ప్రభుత్వం రెండు గ్యారెంటీలను అమలు చేసిందని.. మరో రెండు గ్యారెంటీలను అమలు చెయబోతున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గురించి తెలుసుకోవాలంటే చరిత్ర చదవాలన్నారు. రాష్ట్రంలో పాలన సవ్యంగా సాగాలంటే పార్లమెంట్ ఎక్కువ స్థానాలను గెలిపించి, ముఖ్యమంత్రికి బలాన్ని ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతీ నియోజకవర్గాన్నికి 3,500 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేసి 70 వేల ఎకరాలకు నీరందిస్తామని చెప్పారు. అచ్చంపేట అభివృద్ధికి తమ సహకారం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 60 శాతం యువతకే అవకాశం

పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 60 శాతం యువతకే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భూ కబ్జాలు, బెదిరింపులు, రౌడీయిజం చేయడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. ఇప్పటికీ మూడు వేల ఎకరాలకు సాగునీరు అందించినట్లు నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని మరోమారు సవాల్ విసిరారు. గతంలో పోలీసు రాజ్యం ఉండేదని, ప్రస్తుతం తమ పాలన ప్రజా పాలన అని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లురవి అన్నారు. ఆరు నెలల్లో ప్రభుత్వం పోతుందని బీఆర్ఎస్ నాయకులు అంటున్నారని, ఆరు నెలలు కాదని మరో 10 ఏళ్లు తమ ప్రభుత్వమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీలు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు చిన్నారెడ్డి, సంపత్ కుమార్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడారు.

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలు వైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయం లో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవస్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు





జన జాతరకు వేళాయె..

వరంగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆది వాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వన దేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్లతో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.


సమ్మక్క గద్దె


సారలమ్మ గద్దె

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

- నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు
- నాలుగు రోజులు పూజలందుకోనున్న వనదేవతలు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడువునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.

25న 'వనపర్తి ఒడిలో' పుస్తక ఆవిష్కరణ సభ

పాలమూరు, ఫిబ్రవరి 20 : వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 25న 'వనపర్తి ఒడిలో' పుస్తకావిష్కరణ సభ నిర్వహించనున్నామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1959 నుంచి 1973 మధ్య కాలంలో వనపర్తి పట్టణంలో నివాసం ఉండి బాల్యం, తొలి యౌవనం గడిపిన రాఘవశర్మ అప్పటి తన వనపర్తి జ్ఞాపకాలను యాభై ఏళ్ల తర్వాత రాసినట్లు పేర్కొన్నారు. ఆయన జ్ఞాపకాలను తమ వేదిక పుస్తకంగా ముద్రించిందన్నారు. పుస్తకావిష్కరణ సభకు వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ జి.హరగోపాల్ ముఖ్య అతిథిగా, డా.జతీన్‌కుమార్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, వనపర్తి స్థానిక మిత్రులు, వేదిక మిత్రులు స్నేహవాక్యం వినిపించేందుకు హాజరవుతారని చెప్పారు. సభను కే.వెంకటేశ్వర్లు, ఎండీ.ఇక్బాల్‌పాషాల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు వివరించారు.

పార్టీ పూర్వ వైభవం కోసం చేరికలను ఆహ్వానిస్తున్నాం

- బీఆర్‌ఎస్‌ను నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యం
- ఎంపీ, సర్పంచ్, పరిషత్ ఎన్నికలో సత్తాచాటేందుకు అందరూ ఏకం కావాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 : అసెంబ్లీ ఎన్నికల్లో ఒక ఎమోషన్‌తో కొట్లాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు పార్టీ పూర్వవైభవం కోసం అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి చురుగ్గా పనిచేసిన వారెందరో పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వాళ్ల వేధింపులకు భయపడి కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. ఇప్పుడు వారంతా తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం పార్టీలోకి వచ్చేవారందరినీ ఆహ్వానించండని చెప్పడం జరిగిందన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 12 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో చేరికలు తన వ్యక్తిగతం కాదని, ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఒకటే విధానం ఉంటుందని, అది పార్టీ విధానమని తేల్చిచెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు, ఆ తరువాత సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించాలని, ఇందుకోసం పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వ్యవస్థలు నాశనం అయ్యాయని, అందుకే బీఆర్‌ఎస్‌ను నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పార్టీ పునర్నిర్మాణం జరగాలన్నదే తమ వ్యూహమని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉండి ఇతర పార్టీలకు చెందిన వ్యక్తి మునిసిపల్ చైర్మన్‌గా ఉంటే పాలనాపరంగా చాలా ఇబ్బందులు ఉంటాయని, అవిశ్వాస తీర్మానంతో పీఠం దక్కించుకోవడం జరిగిందన్నారు. ఐదుమంది సభ్యుల బలం ఉన్న తాము ఈ పీఠం దక్కించుకోవడం అంత ఆషామాషీ వ్యవహారం కాదని, అయినా అందరూ కలిసికట్టుగా పనిచేసి అన్ని పార్టీల కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్‌ను దక్కించుకున్నామని, రాష్ట్రంలోనే అతి పెద్దదైన పాలమూరు మునిసిపాలిటీని దక్కించుకోవడం ద్వారా రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ బలోపేతనానికి దోహదపడిందన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, బెనహర్, బెక్కరి అనిత, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ల చేరికపై అసంతృప్తి

కాంగ్రెస్ పార్టీలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల చేరికపై పార్టీలోని ఓ వర్గం వ్యతిరేకిస్తూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. మంగళవారం బీఆర్‌ఎస్‌లో 12 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారి చేరికలను కొందరు వ్యతిరేకిస్తూ పార్టీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో ఉన్నపుడు వారికి వ్యతిరేకంగా పోరాడిన తమపై కేసులు పెట్టించారని, ఇప్పుడు ఎలా పార్టీలో చేర్చుకుంటారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ పార్టీ కార్యాలయంలో బైఠాయించి చొక్కా విప్పి నిరసన వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసిన తమను గుర్తించరు కానీ కొత్తగా వచ్చిన వారిని మాత్రం ఆహ్వానించడం దారుణమన్నారు. మరో కార్యకర్త నరేశ్ కంటతడి పెట్టగా నాయకులు జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమింపజేశారు.

ప్రజ్వలిస్తున్న ఆధ్యాత్మిక భావన

- మాజీ పీఎం పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్‌రావు
- వట్టెం ఆలయంలో ప్రభాకర్‌రావు ప్రత్యేక పూజలు


నవోదయ విద్యాలయంలో పీవీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న పీవీ ప్రభాకర్‌రావు

బిజినేపల్లి, ఫిబ్రవరి 20: ఆలయ పరిసరాల్లోని అణువణువులో ఆధ్మాత్మిక భావన ప్రజ్వరిల్లుతోందని భారతరత్న, మాజీ పీఎం పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెంలోని గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డితో కలిసి ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గుట్టపై పచ్చని చెట్లు, రామానుజాచార్యుల పార్కు, పక్కనే వెంకటాద్రి రిజర్వాయర్ నిర్మాణం, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయ పరిసరాల్లో భక్తిభావన నిండినట్లుగా ఉందన్నారు. తన తండ్రి మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు దేశంలోని అత్యంత ఉన్నత పురస్కారం కేంద్రం ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేసి, ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులతో కలిసి పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి, మాట్లాడారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. వారి వెంట ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సందడి ప్రతాప్‌రెడ్డి, సందడి నరేందర్‌రెడ్డి, అడ్వకేట్ జంగం రవికుమార్, ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జానకిరాములు, భాస్కరాచారి, వెంకటరెడ్డి, విట్టల్‌సింగ్ తదితరులున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై ప్రిసిల్ల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ సాగుల శ్రీరాములు(46) ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి భరించలేని కడుపునొప్పి రావడంతో ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతుడి కుమారుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ, ఫిబ్రవరి 20 : ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రానికి చెందిన ఇస్నాతి రమేష్(42) ఆదివారం గ్రామంలోని వైన్స్ సమీపం నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఇదే మండలం మాదారం గ్రామానికి చెందిన మల్లేష్ బైక్‌పై హన్వాడ నుంచి గ్రామానికి వెళ్తూ ఎదురుగా వస్తున్న రమేష్ బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

హన్వాడ, ఫిబ్రవరి 20 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. కోయిలకొండ మండలంలోని ఆచార్యపూర్ వాగు నుంచి ఇసుకను జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున చిన్నదర్పల్లి తండా వద్ద టిప్పర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

» డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప



ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సిద్ధప్ప

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 20 : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని, ఇది అంటువ్యాధి కాదని, అంటించుకునేదని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్ప అన్నారు. జిల్లాకేంద్రంలోని జమ్ములమ్మ సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అయన మాట్లాడారు. తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి నాలుగు రకాలుగా వస్తుందని, అవాంఛనీయ లైంగిక సంబంధాల ద్వారా, కర్త మార్పిడి, తల్లి నుంచి బిడ్డకు, సిరంజీల ద్వారా వస్తుందన్నారు. యువత మంచి దారిలో నడవాలని, మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఎవరికైనా అనుమానం ఉంటే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్జీవో ప్రోగ్రాం మేనేజర్ ఉదయ్‌శేఖర్, గద్వాల జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, సుధాకర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మధుసూదన్‌రెడ్డి, కృష్ణసాగర్, ఐసీటీసీ కౌన్సిలర్ ఫరీద్ పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి

» జిల్లా సంక్షేమాధికారి సుధారాణి

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 20 : అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటిస్తూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని, లేకపోతే చర్యలు తప్పవని జిల్లా సంక్షేమాధికారి సుధారాణి అన్నారు. ఇప్పటివరకు జిల్లా ఇన్‌చార్జి స్త్రీ, శిశు సంక్షేమాధికారిగా బాధ్యతలు నిర్వర్తిం చిన ముషాయిదాబేగం ఇటీవలే మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో నిజామాబాద్ జిల్లా భీంగల్‌లో సీడీపీవోగా పని చేస్తున్న సుధారాణి ఇక్కడ జిల్లా సంక్షేమాధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చూస్తానన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. పౌష్టికాహారం తప్పుదోవ పడుతున్నట్లు తెలిస్తే ఊపేక్షించబోనని హెచ్చరించారు.

ప్రతిభ చాటిన గద్వాల విద్యార్థులు



జ్ఞాపికలను అందుకున్న గద్వాల విద్యార్థులు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 20 : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (మ్యాథ్స్ అండ్ సైన్స్) ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో పట్టణానికి చెందిన ప్రగతి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఆరవ తరగతి విద్యార్థిని రజని రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నది. జిల్లా స్థాయిలో నాల్గవ తరగతి విద్యార్థిని అయేషా ప్రథమస్థానం, మూడవ తరగతి విద్యార్థిని నందిక ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఇందు (8వ తరగతి), బీటీ హరణి (6వ తరగతి), షోయబ్ (5వ తరగతి), అరవింద్ (4వ తరగతి), అక్షిత్ (3వ తరగతి) కన్సోలేషన్ బహుమతులను దక్కించుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, టీఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు మధుసూదన్, డీఆర్‌డీవో సైంటిస్ట్, ఎస్ఆర్ఎఫ్ ఆర్గనైజర్ తుమ్మ అమరేష్ చేతుల మీదుగా జ్ఞాపికలు, బహుమతులు అందుకున్నట్లు కరస్పాండెంట్ సవారన్న తెలిపారు.

గద్వాల విద్యార్థినికి బంగారు పతకం

గద్వాల టౌన్, ఫిబ్రవరి 20 : పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని నందిని బంగారు పతకాన్ని సాధించింది. 2020-22 విద్యాసంవత్సరంలో ఎంఏ(ఇంగ్లీష్) పూర్తి చేసిన ఆమె పాలమూరు విశ్వవిద్యాలయం పరిధిలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకున్నది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

నెలాఖరుకు పనులు పూర్తి కావాలి

» మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 20 : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అదనపు వార్డుల నిర్మాణం ఈ నెల చివరి నాటికి పూర్తయ్యేలా చూడాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పార్వతి టీఎస్ఎంఎస్ఐడీసీ ఏఈ రహీంను ఆదేశించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే నెలలో ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) బృందం ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తారని, ఆ తర్వాత మెడికల్ కళాశాలకు సంబంధించి 50 సీట్లు మంజూరు చేస్తారని తెలిపారు. అందుకే వార్డుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలోని సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది తదితర అంశాలపై జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ నవీన్‌క్రాంతితో చర్చించారు.

విద్యార్థికి చదువే ఆయుధం

» జిల్లా నోడల్ అధికారి హృదయరాజు



మాట్లాడుతున్న హృదయరాజు, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మానవపాడు, ఫిబ్రవరి 20 : ప్రతీ విద్యార్థికి చదువే ఆయుధమని జిల్లా నోడల్ అధికారి హృదయరాజు అన్నారు. మండల కేంద్రంలోని గంగు వెంకట కృష్ణారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ ముఖ్యమైయిందని, ఈ సమయంలో చదువును నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మణ్ రావు, వెంకటకృష్ణారెడ్డి, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



లబ్ధిదారుకు బీమా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని బీరెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దుబ్బ బీసన్న ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఆయనకు పార్టీ తరఫున రెండు లక్షల రూపాయల బీమా మంజూరయ్యింది. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం దుబ్బ బీసన్న కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌నాయుడు, బీచుపల్లి, లత్తిపురం రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

» కలెక్టర్ బీఎం సంతోష్ » చాగదోణ, మాచర్ల, గట్టులలో పర్యటన
» ఉన్నత, గురుకుల పాఠశాలల తనిఖీ » హిందీ, ఇంగ్లీష్ పాఠాలు చదివించిన కలెక్టర్
» బోర్డుపై రాసిన వాక్యాలను చదువలేకపోవడంతో అసహనం



చాగదోణ ఉన్నత పాఠశాలలో విద్యార్థితో పాఠం చదివిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గట్టు, ఫిబ్రవరి 20 : ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని, అప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోగలమని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మండల పరిధిలోని చాగదోణ, మాచర్ల ఉన్నత పాఠశాలలతో పాటు, గట్టు గురుకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. చాగదోణ, మాచర్ల ఉన్నత పాఠశాలల్లో పదవతరగతి విద్యార్థులతో మాట్లాడి సామర్థ్యాలను పరిశీలించారు. చాగదోణ పాఠశాలలో విద్యార్థులతో ఇంగ్లీష్, హిందీ పాఠాలు చదివించారు. కానీ బోర్డుపై రాసిన హిందీ వాక్యాలను ఒకరిద్దరు విద్యార్థులు మాత్రమే చదవడంతో ఆయన కొంత అసహనం వ్యక్తం చేశారు. ఇదేం బోధన అని ఉపాధ్యాయులను మందలించారు. కొందరు విద్యార్థులు బడికి రావడం లేదని, కొందరిని తల్లిదండ్రులు పొలం పనులకు తీసుకెళ్తున్నారని వారు కలెక్టర్‌కు వివరించారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలున్నా, ఫలితాలలో మాత్రం జిల్లాలోనే ఆఖరి స్థానంలో ఉందన్నారు. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులున్నా ఫలితాలు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. గత ఏడాది 27 మంది పదవ తరగతి పరీక్ష రాస్తే, ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించడమేమిటన్నారు. ఈసారి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదవ తరగతిలో 27 మంది పరీక్షలు రాయగా ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధిస్తే ఎలా అన్నారు. ఈసారైనా పూర్తి స్థాయి ఉత్తీర్ణత తీసుకరావాలని కలెక్టర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, విద్యార్థులను ప్రతీ రోజు పాఠశాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. మాచర్ల ఉన్నత పాఠశాలలో 51 మంది పదవ తరగతి విద్యార్థులున్నారని, అందరూ ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. అనంతరం గట్టు బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఇందిర, రీజినల్ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్‌రాణి, తహసీల్దార్ సరితారాణి, ఎంఈవో కొండారెడ్డి, ఎంపీపీ విజయ్, ప్రిన్సిపాల్ వాణీదేవి, ప్రత్యేక అధికారి ప్రియాంక, నయాబ్ తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో చెన్నయ్య, ప్రధానోపాధ్యాయులు నర్సింహులు, రుక్మత్‌బాషా పాల్గొన్నారు.

ప్రత్యేక చొరవ తీసుకోవాలి

పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గట్టు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవతరగతిలో గత ఏడాది కన్నా ఈ సారి ఎక్కువ ఉత్తీర్ణత సాధించాలన్నారు. మండలంలో అక్షరాస్యతను పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మన ఊరు - మన బడి కింద అన్ని పాఠశాలల్లో వసతులు కల్పించామని, డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నామని తెలిపారు. యూడైస్ ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలిస్తామన్నారు. చాగదోణ, బోయలగూడెం, మాచర్ల, ఆలూరు, ఇందువాసి పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరైతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి గ్రామాలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈవో ఇందిర, ప్రత్యేక అధికారి ప్రియాంక, తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీవో చెన్నయ్య, ఎంఈవో కొండారెడ్డి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

గద్వాల అర్బన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. క్రీడల్లో పతకాలు సాధించడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగాల్లో రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం, తేరు మైదానంలో ఖేలో ఇండియా క్రీడల కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అధికారులతో మాట్లాడి క్రీడాకారుల వివరాలు తెలుసుకున్నారు. ఇండోర్ స్టేడియంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్టేడియంలో జిమ్, షటిల్, తైక్వాండో తదితర సదుపాయాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇండోర్ స్టేడియం, తేరుమైదానం క్రీడలకు ఎంతో అనువుగా ఉన్నాయన్నారు. క్రికెట్, కరాటే, ఫుట్‌బాల్ క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. అంతకుముందు ఆయనకు క్రీడల శాఖ అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం కాసేపు షెటిల్‌తో పాటు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి (డీఐఎస్‌వో) డాక్టర్ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, ఖేలో ఇండియా అధికారి జాడే శ్రీనివాసులు, మహిళా పీఈటీల సంఘం అధ్యక్షురాలు హైమావతి, కార్యదర్శి శైలజ, తైక్వాండో రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, శ్రీనివాసులు, అరుణ్ పాల్గొన్నారు.

విజ్ఞాన పురోగతితోనే సుస్థిర అభివృద్ధి

» ప్రాజెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ స్రవంతి » సామర్థ్యాల పెంపునకు నిరంతర కృషి : అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాల్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ స్రవంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాల్

గద్వాల టౌన్, ఫిబ్రవరి 20 : విజ్ఞాన శాస్త్ర పురోగతితోనే సుస్థిర అభివృద్ధికి బాటలు వేయగలమని హైదరాబాద్‌కు చెందిన సీఎస్ఐఆర్-సీసీఎంబీ ప్రాజెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ బి.స్రవంతి అన్నారు. నూతన సాంకేతికత, శాస్త్రీయ పరిజ్ఞానంపై నిరంతర పరిశోధనలు అవసరమన్నారు. పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం 'సైన్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్' అంశంపై జోగుళాంబ జోన్ లెవల్ ఒక్క రోజు వర్క్‌షాప్, పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి కోసం సాగుతున్న పరిశోధనలను వివరించారు.

రీసోర్స్ పర్సన్‌గా హాజరైన ఎమ్మిగనూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.పాల్ దేవానందం మాట్లాడుతూ భవిష్యత్ తరాల అవసరాలను తీర్చుకునే దిశగా సామర్థ్యాల పెంపునకు, రాజీ పడకుండా పరిశోధనలు సాగించాల్సి ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక పురోగతి కోసం సాగుతున్న కృషి, జరుగుతున్న పరిశోధనలు, విజ్ఞానుల కృషిపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విజ్ఞాన శాస్త్ర పురోగతికి సంబంధించిన పలు పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీపతి నాయుడు, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ లవీన మంజులత, కోకన్వీనర్ డాక్టర్ కే.సత్యన్న, కృష్ణ మూర్తి, మనోజ్ కుమార్, హరిబాబు, హరినాగభూషణం, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ వెంకటేశ్వరమ్మ, కళాశాల ఏవో మక్బుల్ అహ్మద్ ఉన్నారు.

విద్యార్థులకు పరామర్శ

గద్వాల, ఫిబ్రవరి 20 : మండల పరిధిలోని లేకులపల్లి పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులను జడ్పీ చైర్ పర్సన్ పరామర్శించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో ఆమె మాట్లాడారు. సంఘటన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల సిబ్బందితో మాట్లాడారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి ట్యాంకును శుభ్రం చేయించాలన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంఈవోను ఆదేశించారు. ఆమె వెంట నాయకులు శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వంతెన ఎత్తు పెంచాలి

రాజోలి, ఫిబ్రవరి 20 : భారత్‌మాల రహదారి నిర్మాణంలో భాగంగా రాజోలి నుంచి వడ్డేపల్లికి వెళ్లే దారిలో నిర్మిస్తున్న వంతెన ఎత్తు పెంచాలని గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని 11 గ్రామాల రైతులు సాగు చేసిన పంటను విక్రయించుకునేందుకు లారీల్లో లోడ్ చేసుకొని ఇదే దారిలో తీసుకెళ్తారని తెలిపారు. బ్రిడ్జిని తక్కువ ఎత్తులో నిర్మిస్తుండటంతో లారీలు వెళ్లేందుకు ఇబ్బంది అవుతుందని ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో రాజోలి మాజీ ఉప సర్పంచు గోపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ రెడ్డి, గ్రామ పెద్దలు మల్లేష్, లోకేష్, పరశురాముడు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

ధరూరు, ఫిబ్రవరి 20 : ధరూరు తహసీల్దార్‌గా కె.వెంకటరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఖాతూంబీ ఉండవల్లి మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మానవపాడు : మండల తహసీల్దార్‌గా వహిదా ఖాతున్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు విధులు నిర్వర్తించిన తహసీల్దార్ జుబేర్ మోహినుద్దీన్ మల్దకల్‌కి బదిలీ అయ్యారు.

గట్టు : మండల తహసీల్దార్‌గా సరితారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ధనుంజయ కలెక్టరెట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కేటీదొడ్డి మండలం నుంచి సరితారాణి నియమితులయ్యారు.

కేటీదొడ్డి : మండల తహసీల్దార్‌గా షాహీదాబేగం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ సరితారాణి గట్టు మండలానికి బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో షాహిదాబేగం బాధ్యతలు చేపట్టారు. మల్దకల్ మండల తహశీల్దార్‌గా జుబేర్‌మొయిద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

పోస్టాఫీసులో ఖాతాలు తెరవాలి

గట్టు, ఫిబ్రవరి 20 : పోస్టాఫీసులో ఖాతాలు తెరవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవిందునాయక్ రైతులకు సూచించారు. పీఎం కిసాన్‌పై ఆరగిద్ద గ్రామంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడీ మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాకు ఆధార్ నంబర్ లింకు చేసుకోని వారు, ఎన్‌పీసీఐ ఖాతా తెరవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ సంగీత లక్ష్మీ, ఎంఏవో హన్మంత్‌రెడ్డి, ఎఈవో తిరుమలేశ్, పోస్టల్ అధికారి సత్యప్రియ పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

» ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రెడ్డి

ఇటిక్యాల, ఫిబ్రవరి 20 : వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించేందుకు క్లోరినేషన్‌ను పకడ్బందీగా చేయాలని, పైపు లైను లీకేజీలు లేకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామాలలో పనిచేయని బోర్లను మరమ్మతు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మహ్మద్ అజహర్‌మొయిద్దీన్, ఇంట్రాశాఖ ఏఈ వంశీసాగర్, వాటర్ గ్రిడ్ ఏఈ రమేష్, ఎంపీవో భాస్కర్ యాదవ్, ఎంఈవో రాజు, పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావు పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడాలి

ఎర్రవల్లి, ఫిబ్రవరి 20 : గ్రామాల్లోని తాగునీటి వనరులను కాపాడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీధర్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్‌భగీరథ అధికారులు, వాటర్‌మన్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో అజర్‌మొహినొద్దీన్, ఎంపీవో భాస్కర్ పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యతపై దృష్టి సారించాలి

» ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హర్షద్

ఉండవల్లి, ఫిబ్రవరి 20 : తాగునీటి నాణ్యతపై దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హర్షద్ అన్నారు. మిషన్ భగీరథ నీటి ప్రమాణాలపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వాటర్‌మెన్‌లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ కెమిస్ట్ రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ నీటి సరఫరా సమయంలో మెయిన్ ట్యాంక్‌లో నీటిని క్లోరినేషన్ చేస్తారని, ఆ తర్వాత నీటి సరఫరా చివరకు చేరుకున్నప్పుడు నీటిలో నాణ్యతో తగ్గే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి వాటర్ మ్యాన్ శ్యాంపిల్ కిట్‌తో ఎప్పటికప్పుడు నీటిని పరీక్షించి తగిన మోతాదులో క్లోరినేషన్ చేయాలని సూచించారు. శ్యాంపిల్ సేకరణ, నాణ్యత ప్రమాణాల గుర్తింపు తదితర అంశాలను వివరించారు. నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని, వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఇందుకు ప్రత్యేక పంచాయతీ కార్యదర్శులు, వాటర్ మ్యాన్‌లు బాధ్యత వహించాలని చెప్పారు. కార్యక్రమానికి ఎంపీవో పద్మావతి హాజరయ్యారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల


అయిజ, ఫిబ్రవరి 20 : తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీరెడ్డి, వాగుగడ్డ విష్ణువర్ధన్‌రెడ్డి, మహానందిరెడ్డి, ప్రజాప్రతినిధులు సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు విడుదల చేశారు. ఈ నెల 27 నుంచి, మార్చి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. 'మన ఊరు, మన జాతర, మనందరి బాధ్యత' అనే నినాదంతో అందరినీ భాగస్వాములను చేస్తూ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ

అలంపూర్, ఫిబ్రవరి 20 : అలంపూర్ మాంటిస్సోరీ పాఠశాలలో సోమవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో సరస్వతీ పూజ నిర్వహించారు. ముందుగా హెచ్ఎం.నాగలక్ష్మీ గణపతిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం సరస్వతీ పూజలతో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రవిప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడుతున్న పచ్చదనం

» నీరు లేక ఎండిపోతున్న మొక్కలు » నిర్వహణ లేక నీరుగారుతున్న లక్ష్యం
» కళ తప్పుతున్న పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు



వీరాపురంలోని బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

గద్వాల, ఫిబ్రవరి 20 : పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు పచ్చదనం కోల్పోతున్నాయి. గ్రామాల్లో అహ్లాదకర వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. పచ్చదనంతో పాటు అడవుల విస్తీర్ణం పెంచడమే ధ్యేయంగా బృహత్ పల్లె ప్రకృతి ఏర్పాటు చేసింది. వాటిలో లక్షలాది మొక్కలను నాటారు. వాటి నిర్వహణపై గ్రామ పంచాయతీలు చేతులెత్తేశాయి. నీరు పోసే దిక్కు లేక మొక్కలు ఎండిపోతున్నాయి.

10 ఎకరాలలో బృహత్ పల్లె ప్రకృతి వనాలు

జిల్లాలోని 12 మండలాల్లో 60 బృహత్ పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు భూమిని గుర్తించారు. అందులో 57 వనాలను పూర్తి చేశారు. కొన్నింటిని 10 ఎకరాలలో ఏర్పాటు చేయగా, భూమి తక్కువగా ఉన్న చోట ఐదు నుంచి ఎనిమిది ఎకరాల్లో వనాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో దాదాపు 2,94,300 మొక్కలను నాటారు. ఉసిరి, జామ, సీతాఫలం, మామిడి, అల్లనేరేడు, వేప, కానుగ, దానిమ్మతో పాటు పలు రకాల మొక్కలను నాటారు. ఒక్కో బృహత్ పల్లె ప్రకృతి వనానికి రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా వాచర్లను ఏర్పాటు చేసి మొక్కలకు నీళ్లు పోయడం, కంచె ఏర్పాటు చేయడం, పిచ్చి మొక్కలను తొలగించడం తదితర పనులను క్రమం తప్పకుండా నిర్వహించడంతో ఆ వనాలు రెండేళ్ల పాటు పచ్చదనంతో కళకళలాడాయి. ఇంత వరకు బాగానే ఉన్నది. కానీ ప్రస్తుతం నిర్వహణ కరువవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. పిచ్చిమొక్కలు పెరగడంతో అవి కళావిహీనంగా తయారయ్యాయి.

పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అంతంతే...

పల్లె ప్రగతిలో బాగంగా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. గ్రామ కంఠంలోని మిగులు భూమి, వెంచర్లలోని 10 శాతం భూములు, ప్రభుత్వ స్థలాలలో వీటిని ఏర్పాటు చేశారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల్లో 296 చోట్ల వీటిని ఏర్పాటుచేసి 6,11,027 మొక్కలను నాటారు. ఒక్కో వనం ఏర్పాటుకు గరిష్ఠంగా నాలుగు లక్షల రూపాయలను ఖర్చు చేశారు. వీటికి కూడా రెండేళ్ల పాటు వాచర్లతో నీళ్లు పోయించారు. ఆ తర్వాత పంచాయతీలకు అప్పగించారు. అయితే అవి గ్రామాల పరిధిలో ఉండటంతో కొంత వరకు కాపాడుకోగలిగారు. కానీ పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన గ్రామాల్లో వనాలు పచ్చదనం కోల్పోయాయి. ఇప్పటికైనా అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో అధికారులు వీటిపై దృష్టి సారించి ప్రకృతి వనాలను సంరక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీలకు నిర్వహణా బాధ్యతలు

పల్లె ప్రకృతి, బృహత్ పల్లె ప్రకృతి వనాలకు రెండేళ్ల పాటు ఉపాధి హామీ ద్వారా వాచర్లను ఏర్పాటు చేసి నీళ్లు పోయించారు. కాలపరిమితి పూర్తికావడంతో వాచర్లను తొలగించి, వాటి బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. అయితే పంచాయతీల్లో నీటి ట్యాంకర్లు ఉన్నప్పటికీ, డీజిల్ బిల్లులు రావడం లేదని, నిధులు లేవనే కారణాలతో వారు పట్టించుకోలేదు. దానికి తోడు ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో నీరు లేక బృహత్, పల్లె ప్రకృతి వానాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. మరికొన్ని చోట్ల వాడుపట్టాయి. ఈ వేసవిలో సరిపోను నీరు పోయకపోతే అవి పూర్తిగా ఎండిపోయే పరిస్థితి నెలకొన్నంది. అయినా వీటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రకృతి వనాలను పరిశీలిస్తా

నర్సింగ్‌రావు, డీఆర్‌డీఏ పీడీ : బృహత్ పల్లె ప్రకృతి వనాలను పరిశీలిస్తా. వాస్తవంగా రెండేళ్ల నిర్వాహణ తర్వాత వాటిని గ్రామ పంచాయతీలకు అప్పగించాం. ఇప్పుడు వారే నిర్వహించాల్సి ఉంటుంది. అయినా, వనాలను పరిశీలించి, ప్రత్యేకాధికారుల ద్వారా వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటాము.